# బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు అంబేద్కర్




అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్

- స్పీకర్ ప్రసాద్‌కుమార్, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి
- వికారాబాద్‌లో ఘనంగా అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలు

వికారాబాద్, ఏప్రిల్ 14 : రాజ్యాంగ ప్రదాత, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు అంబేద్కర్ అని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాల్లో భాగంగా వికారాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డిలతో కలిసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడుతూ.. మహనీయులు ఇచ్చిన స్ఫూర్తి భవిష్యత్తు సమాజానికి సామాజిక బాధ్యత, సమాజ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు.

### హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. జయంతి ఉత్సవాల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, ఆర్డీవో వాసుచంద్ర, ఎస్సీడీ డబ్ల్యూవో మల్లేశం, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, అంజి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### గొప్ప సంఘ సంస్కర్త అంబేద్కర్

వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఎస్పీ నారాయణరెడ్డి నివాళులర్పించారు. మహాజ్ఞాని, గొప్ప సంఘ సంస్కర్త అయిన అంబేద్కర్ మన దేశానికి రాజ్యాంగాన్ని అందించి, అణగారిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక సమానత్వానికి విశేష కృషి చేశారని కొనియాడారు. నేటి యువత ఆయన ఆశయాలను, జీవిత మార్గదర్శకత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని, విద్య ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకొని, సమాజ సేవలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, ఆర్ఐలు, ఇతర పోలీసు అధికారులు, పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

# రోడ్ కటింగ్.. నయా రూల్స్!




ఇబ్బడిముబ్బడి తవ్వకాలకు చెక్
ఇక మీదట ఇంజినీర్లే
అన్నింటికీ బాధ్యులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో రోడ్ కటింగ్ అనుమతులపై కమిషనర్ ఇలంబర్తి నూతన నియమ నిబంధనలను అమల్లోకి తీసుకువస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. అడ్డగోలుగా రోడ్ కటింగ్ పర్మిషన్లు ఇస్తుండడం, తిరిగి పునరుద్ధరణలో జాప్యం కారణంగా వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతుండడం, అంతేకాకుండా ముఖ్యంగా అసంపూర్తిగా రోడ్ కటింగ్ ప్రతిపాదనలు సమర్పిస్తుండడం పట్ల కమిషనర్‌కు ఫిర్యాదులు వెలువెత్తాయి. అన్నింటి కంటే జోనల్ కమిషనర్ల అనుమతితో రోడ్ కటింగ్ పర్మిషన్లు ఇక ఉండకుండా నేరుగా సంబంధిత ఇంజినీర్లే బాధ్యులుగా వ్యవహరించనున్నారు. రోడ్ కటింగ్ పర్మిషన్ నుంచి రహదారి పునరుద్ధరణ వరకు ఇంజినీర్లు కీలకం కానున్నారు.

### నూతన నియమ నిబంధనలు ఇవే..

- పది మీటర్ల వరకు రోడ్ కటింగ్‌కు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనుమతులు ఇవ్వాలి.
- 15 మీటర్ల రోడ్డు కటింగ్ కోసం వచ్చిన దరఖాస్తులను సూపరింటెండెంట్ ఇంజినీర్ పరిశీలించి అనుమతులు ఇవ్వడంతో పాటు పనులు పూర్తయిన తర్వాత పునరుద్ధరణకు మళ్లీ జీహెచ్ఎంసీకి పంపించాల్సి ఉంటుంది.
- 15 మీటర్ల కన్నా ఎక్కువ రోడ్డు కటింగ్‌కు అనుమతులు కోరితే ఆ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. తనిఖీల నివేదికతో పాటు సంబంధిత ఫైల్‌ను చీఫ్ ఇంజినీర్‌కు పంపాల్సి ఉంటుంది.
- గతంలో జారీ చేసిన జీవో 82 ప్రకారం రోడ్డు కటింగ్ క్యాలిక్కులేషన్లు, జీవో 53 ప్రకారం విధించాల్సిన రోడ్డు కట్టింగ్ చార్జీలను తప్పకుండా పాటించాల్సి ఉంటుంది.
- రోడ్డు కటింగ్ మెథలాజీస్‌ను అనుసరించి విధించాల్సిన కటింగ్ చార్జీల శాంపిళ్లను సర్క్యులర్‌లో పొందుపర్చాలి.

### అంచనాలు, మంజూరీలు తప్పనిసరి

రోడ్ కటింగ్ పనులు పూర్తయిన వెంటనే రోడ్డును పునరుద్ధరించేందుకు ఇంజినీర్లు అంచనాలు తయారు చేసి, దానికి సంబంధించిన మంజూరీని కూడా జతపర్చాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సంబంధిత రోడ్డుకు సంబంధించి ల్యాండ్ కాస్ట్, కటింగ్‌కు సంబంధించిన గణాంకాలను కూడా సమర్పించాల్సి ఉంటుందన్నారు. దీనికి తోడు విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం వస్తున్న రోడ్డు కటింగ్ ప్రతిపాదనలకు గూగుల్ మ్యాప్‌ను కూడా పంపించాలి. కటింగ్‌లకు విధించే చార్జీలకు 16.5 శాతం సెంటేజీ చార్జీలను, అలాగే రోడ్డు పునరుద్ధరణ పనులకు 18 శాతం జీఎస్టీని విధిస్తూ సీఈ (చీఫ్ ఇంజినీర్)కి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి స్వేరోస్ సభను ప్రారంభిస్తున్న ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

# భయాన్ని వదిలేసినప్పుడే విజయం

- స్వేరోస్ అధినేత ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్
- తలకొండపల్లిలో భీమ్ దీక్ష ముగింపు సభ
- పాల్గొన్న పలు రాష్ట్రాలు, జిల్లాల స్వేరోస్ సభ్యులు

కడ్తాల్, ఏప్రిల్ 14 : మనిషి భయాన్ని వదిలేసినప్పుడే విజయం వైపు అడుగులు పడతాయని స్వేరోస్ వ్యవస్థాపకుడు, అధినేత ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. తలకొండపల్లి చౌరస్తాలో స్వేరోస్ ఆధ్వర్యంలో భీమ్ దీక్ష ముగింపు సభను ఆదివారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. ముగింపు సభకు ముఖ్య అతిథిగా ప్రవీణ్‌కుమార్‌తోపాటు ఉత్తరప్రదేశ్, కర్ణాటక, హర్యానా, పంజాబ్, తెలుగు రాష్ట్రాలకు చెందిన పెద్దఎత్తున స్వేరోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలకొండపల్లి చౌరస్తా వద్ద ప్రవీణ్‌కుమార్‌కు స్వేరోలు ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. సభా వేదిక వద్ద ఆయన జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాల వద్ద మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, స్వేరోలు, నాయకులతో కలిసి ఆయన నివాళులర్పించి స్వేరోస్ గీతాన్ని ఆలపించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

సమాజంలోని ప్రతి వ్యక్తి చదువుకున్నప్పుడే జ్ఞానం పెంపొంది, భయం అనే నీడ దూరమవుతుందని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరూ మహనీయుల జీవిత చరిత్రలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకొని ముందుకెళ్లాలన్నారు. స్వేరోస్ సంస్థ మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అధిరోహించేందుకు మార్గం సుగమం చేసిందన్నారు. నిరుపేదలకు జ్ఞానాన్ని అందించేందుకు స్వేరోలు చేస్తున్న కృషిని కొనియాడారు. మహనీయుల మాసాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా మార్చి 15 నుంచి ఏప్రిల్ 13 వరకు భీమ్ దీక్షను చేపట్టడం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. అంబేద్కర్ తెలిపినట్లుగా సమాజ మార్పునకు రాజ్యాధికారం అంతిమ లక్ష్యం అయినప్పటికీ ఆర్థిక స్వావలంబన లేకపోవడంతో అనేక ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొన్నారు. స్వేరోస్ రాష్ట్ర స్థాయి సభకు అన్ని విధాలుగా సహకరించిన మిషన భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సైతం స్వేరోస్ నిర్ణయించిన లక్ష్యాల మేరకు పనిచేసి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. అనంతరం ఆయన స్వేరోస్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన భయం అనే దిష్టిబొమ్మను దహనం చేసి, ప్రతి ఒక్కరికి ధైర్యాన్ని అందించారు.

కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కన్వీనర్లు, ఎగ్జిక్యూటివ్ కన్వీనర్ దుర్గయ్య, ప్రజా గాయకుడు సోమన్న, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ ఎంపీపీ నిర్మల, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింహాము దిరాజ్, బీఆర్ఎస్ తలకొండపల్లి, కడ్తాల్ మండలాల అధ్యక్షులు, స్వేరోస్ రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



యాచారం మండలం మేడిపల్లిలో నేలరాలిన మామిడికాయలను చూపిస్తున్న రైతు

# యాచారంలో వడగళ్ల వాన

## నేలరాలిన మామిడి, దెబ్బతిన్న వరిపంట

యాచారం, ఏప్రిల్ 14 : మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన భాకీ వర్షం కురిసింది. మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, తక్కళ్లపల్లి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. మేడిపల్లిలో ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలగా, వడగళ్ల వర్షానికి పొట్టదశలో ఉన్న వరి, కూరగాయలు, ఆకుకూర పంటలు దెబ్బతిన్నాయి. వడగళ్ల వాన తమకు కడగళ్లు మిగిల్చాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఒకవైపు కరువుతో పంటలెండిపోయి నష్టం వాటిల్లగా.. మరోవైపు అకాల వర్షాలు అపారమైన నష్టాన్ని కలిగించినట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి నష్టపోయిన పంటలను అంచనా వేసి, పంటలు నష్టపోయిన బాధిత రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.



మేడిపల్లిలో కురుస్తున్న వడగళ్ల వాన

# గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చూడాలి

## రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి



ఆదిబట్ల, ఏప్రిల్ 14 : జిల్లావ్యాప్తంగా తాగునీటి సరఫరాకు ఆటంకం కలుగకుండా, ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ తాగునీటి సరఫరాపై సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలన్నారు. అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని.. ఆయా గ్రామాలవారీగా నీటి సరఫరా పరిస్థితిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమీక్షించాలన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి ఉంటే వెంటనే ప్రతిపాదనలు పంపితే వెంటనే నిధులను విడుదల చేస్తానన్నారు. చేతి పంపులు, బోరుబావులకు అవసరమైన చోట మరమ్మతులు జరిపించాలని, ముమ్మందు ఎండలు ఎక్కువగా ఉంటాయని.. దానిని దృష్టిలో పెట్టుకుని నీటి సరఫరాకు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# జీరో బిల్లులు హుళక్కి..

## గృహజ్యోతి పథకం సర్దుబాటు.. వేలల్లో బిల్లులు.. లబ్ధిదారుల ఆవేదన

**సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ):**

- కాటేదాన్‌కు చెందిన ఓ వ్యక్తికి ఏప్రిల్ నెల బిల్లు వచ్చింది. గత నెలలో గృహజ్యోతి కింద వచ్చిన బిల్లు ఈ నెలలో ఆ పథకం వర్తించలేదు. ఈ నెల 4న మీటర్ రీడర్ బిల్లు తీశారు. 29 రోజులకు 199 యూనిట్లు వాడినట్లుండగా మరో రెండు రోజులకు 213 యూనిట్లు యావరేజ్‌గా వేశారు. రూ.1206 బిల్లు వచ్చింది.
- హబ్సిగూడకు చెందిన ఓ వ్యక్తికి గృహజ్యోతి బిల్లు వచ్చింది. 30 రోజులకు 196 యూనిట్లు వాడినట్లు ఉంది. ఇది మార్చి బిల్లు. ఆ నెలలో 31 రోజులకు సర్దుబాటు చేశారు. దీంతో సగటు నెల యూనిట్లు 203 అయ్యాయి. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల వరకే సున్నా బిల్లు వర్తిస్తుంది. ప్రస్తుతం 200 యూనిట్లు దాటడంతో ఆ వ్యక్తికి రూ.1140 బిల్లు వచ్చింది. అధికారులను సంప్రదిస్తే తామేమీ చేయలేమని చెప్పారు.

నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడా పథకానికి నెమ్మదిగా వినియోగదారుల వాడకాన్ని చూపిస్తూ పథకం ప్రకారం లబ్ధిదారుల సంఖ్య తగ్గిస్తున్నది. వేసవికాలంలో వినియోగం పెరుగుతుందనే కనీస అవగాహన ప్రతిఒక్కరికీ ఉంటుంది. ఈ సమయంలో వాడే విద్యుత్ బిల్లులపై యావరేజ్ తీసి వాటి ద్వారా పథకం వర్తించదని చెబుతుంటే లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఎవరైనా అధికారులను కానీ, సిబ్బందిని కానీ ప్రశ్నిస్తే వారికి కష్టాలు తప్పడంలేదు. ఏదో ఒక సాకు చూపించి శాశ్వతంగా పథకం నుంచి దూరం చేస్తామని బెదిరిస్తున్నారట.

### గృహజ్యోతి పోయినట్లేనా..

గ్రేటర్ హైదరాబాద్‌లో గత సంవత్సరం నుంచి గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లులు మొదలయ్యాయి. ప్రస్తుతం 10,03286 మంది జీరో బిల్లు వాడుతున్నారని అధికారులు చెబుతున్నారు. వీరు ప్రతి నెలా 89.39 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నారు. ఇదంతా వేసవికి ముందు ముచ్చట. ఇప్పుడా లెక్క మారింది. విద్యుత్ వినియోగం వేసవి కారణంగా విపరీతంగా పెరిగింది. అయితే ఇదే వినియోగదారులు సుమారు 110 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తున్నట్లు అధికారులు లెక్క తేల్చారు. దీంతో లోడ్ పెరిగిపోతున్నదని, భారం ఎక్కువ కావడంతో కరెంట్ కోతలు తప్పడం లేదని భావించిన ఉన్నతాధికారులు ఒక ప్రణాళిక ప్రకారం జీరో బిల్లులకు చెక్ పెడుతున్నారు. యావరేజ్ బిల్లుతో జీరో బిల్లు రాకుండా చేస్తున్నారు. ప్రధానంగా గృహజ్యోతి పథకంలో లేనివారికి కూడా ముందస్తు బిల్లు కొంత ఇబ్బందే అయినా వారిపై భారం వందల్లో ఉంటున్నది. కానీ పథకం లబ్ధిపొందుతున్న వారికి జీరో బిల్లు బదులు వేలల్లో బిల్లులు రావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ముందస్తుగా వచ్చి బిల్లులు తీయడమే కాకుండా తాము బిల్లు కట్టకపోతే కరెంట్ కట్‌చేస్తామంటూ బెదిరిస్తున్నారని లబ్ధిదారులు వాపోయారు. ఈ విషయంపై ఉన్నతాధికారులను సంప్రదించినా తమకు ఎలాంటి ఫలితం దక్కడం లేదని వారు పేర్కొన్నారు.



### యావరేజ్ బిల్లుతో పథకం కట్..

ప్రతి నెలా మీటర్ రీడర్ ఇంటింటికీ వచ్చి కరెంట్ బిల్లులు జారీ చేస్తుంటారు. ఈ క్రమంలో కొందరికి 29 రోజులకు, మరి కొందరికీ 32 రోజులు ఇలా వెనకా ముందూ బిల్లింగ్ జారీ చేస్తున్నారు. ఆలస్యంగా తీయడం ద్వారా స్లాబ్ మారి బిల్లులు అధికంగా వస్తున్నాయి. దీంతో కొన్నేళ్ల కిందట కాల్చిన యూనిట్ల ఆధారంగా కాకుండా నెల సగటు యూనిట్ల ఆధారంగా శ్లాబును నిర్ణయించే పద్ధతిని ప్రవేశపెట్టారు. మీటర్ రీడర్లు ఒక్కోసారి ఒకటి, రెండు రోజుల ముందే బిల్లులు ఇస్తుంటారు. ఉదాహరణకు మార్చిలో 29న అంటే రెండు రోజుల ముందుగానే నెల బిల్లింగ్ ఇచ్చారు. మిగతా రెండు రోజులకు సగటు లెక్కన బిల్లు జారీ చేశారు. ఈ పద్ధతి గృహజ్యోతి లబ్ధిదారులకు అశనిపాతంలా మారింది. నిర్ణీత 200 యూనిట్లు దాటుతుండడంతో బిల్లు మోత మోగుతున్నది. జీరో బిల్లు రాకుండా పథకం ద్వారా లబ్ధి పొందని పరిస్థితి ఏర్పడుతున్నది. సరిగ్గా నెలకు బిల్లు ఇవ్వకపోవడంతో తమకు బిల్లు మోతమోగుతున్నదని, ఇది విద్యుత్ సంస్థ సేవా లోపమైతే తామెందుకు భరించాలని గృహజ్యోతి లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ తాము రెగ్యులర్‌గా చెక్ చేసుకుని చివరిదశలో 200ల యూనిట్లు దాటే పరిస్థితి ఉంటే అదుపు చేస్తామని, లేకుంటే ప్రభుత్వమే వేసవి వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని 250 యూనిట్ల వరకు ఈ సగటు బిల్లింగ్‌ను పెంచాలని వారు కోరుతున్నారు.

# సమస్యలతో సతమతం

- ప్రత్యేకాధికారుల పాలనతో పూడూరు మండలంలో పడకేసిన పారిశుధ్యం
- పచ్చదనాన్ని కోల్పోతున్న ప్రకృతివనం
- ఆన్ ఆఫ్ సిస్టమ్ లేక వృథాగా పోతున్న తాగునీరు
- ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు
- పట్టించుకోని అధికారులు
- సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు



మీర్జాపూర్‌లో వృథాగా పోతున్న తాగునీరు



మీర్జాపూర్‌లో మురుగు నీటిన శుభ్రం చేసుకుంటున్న ఓ మహిళ



మీర్జాపూర్‌లో అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్న మురుగు నీటి నిల్వ

పూడూరు, ఏప్రిల్ 14 : ప్రత్యేకాధికారుల పాలనతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. మురుగుతో కాల్వలు నిండిపోయి రోడ్లపై పారుతూ దర్శనమిస్తున్నాయి. ఇండ్లపై నుంచే ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు వేల్లాడుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పూడూరు మండలం కంకల్, మీర్జాపూర్ గ్రామాల్లోని పలు వార్డుల్లోని ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోడ్లపై మురుగు నీరు పారుతుండడంతో ఈగలు, దోమల బెడద అధికమై రోగాల బారిన పడుతున్నారు. క్రీడా ప్రాంగణం సమీపంలో హరితహారం ద్వారా గత ప్రభుత్వం మొక్కలు నాటించింది. ప్రస్తుతం సరైన సంరక్షణ లేకపోవడంతో పెరిగిన చెట్లు ఎండిపోతున్నాయి. కంకల్, మీర్జాపూర్ గ్రామాల్లో ఇండ్లపై నుంచి ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు వేల్లాడుతున్నాయి. ఇండ్లపై ఉన్న తీగలను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని బాధిత కుటుంబీకులు వాపోతున్నారు. ఎండాకాలం కావడంతో తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజాప్రతినిధులు సూచిస్తున్నా మీర్జాపూర్‌లో మాత్రం అందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. తాగునీటి బోరు మోటర్‌కు ఆన్ ఆఫ్ సిస్టమ్ లేకపోవడంతో నీరు వృథాగా పోతున్నది. వీధి లైట్లకు ఆన్ ఆఫ్ సిస్టమ్ లేక నిరంతరం వెలుగుతున్నాయి. రాజుగౌడ్ పొలంలో భూమికి రెండు మీటర్ల ఎత్తులో తీగలు వేలాడడంతో సాగు చేయాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశాడు. పొలంలోని విద్యుత్ వైర్లను చూసి ట్రాక్టర్ డ్రైవర్లు సైతం పొలం దున్నేందుకు రావడంలేదు. గ్రామంలోని పలువురి రైతుల పంట సాగు పొలాల్లోనూ ఇదే దుస్థితి నెలకొన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పారిశుధ్య కార్మికులను నియమించి ఎప్పటికప్పుడు మురుగు, చెత్తను తొలగించేలా చర్యలు తీసుకునేది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన అనంతరం ప్రత్యేకాధికారుల పాలనను కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు చేసింది. కొందరు గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని సమస్యలపై దృష్టి పెట్టడంలేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు లేక సోమవారం రోజు 14 మంది చిన్నారులకు గుడ్లను అందజేయలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు మురుగు కాల్వల శుభ్రంతోపాటు ఇండ్లపై, పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కంకల్ గ్రామంలో ప్రమాదకరంగా ఇంటిపై ఉన్న విద్యుత్ వైర్లు



మీర్జాపూర్‌లో భూమికి రెండు మీటర్ల ఎత్తుపై పొలంలో ఉన్న విద్యుత్ వైర్లు


### కాల్వల్లోని మురుగును తొలగించాలి



మురుగు కాల్వలోని మురుగు నీటిని గత నెల నుంచి తొలగించడం లేదు. దీంతో కాల్వలో మురుగు నిలిచిపోయి దోమలు, ఈగలు అధికమౌతున్నాయి. ఎండాకాలం కావడంతో వేడికి రేకుల ఇంట్లో నిద్రపోలేకపోతున్నాం. రాత్రి సమయంలో వాకిట్లో పడుకుందామనుకుంటే కాల్వల్లో నిలిచిన మురుగు నీటిదుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువైంది. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలనుకున్నాను. గతంలో వారానికోసారి మురుగు నీటిని తొలగించేవారు. అధికారులు గతంలో మాదిరిగా కాల్వలోని మురుగు నీటిని, చెత్తను తొలగించాలి.

- ఎర్ర భీమమ్మ, మీర్జాపూర్

### ఇంటిపై నుంచి విద్యుత్ వైర్లను తొలగించాలి



కంకల్ గ్రామంలో పలువురి ఇండ్లపై నుంచి మెయిన్ లైన్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఈ తీగలను తొలగించాలని అధికారులను పలుమార్లు వేడుకున్నాం. కాని అధికారులు వైర్లను తొలగించడంలేదు. గ్రామంలో ఇండ్లపైనే కాకుండా పొలాల వద్ద కూడా ప్రమాదకరంగానే ఉన్నాయి. అధికారులు స్పందించి ఇంటి సమీపంలోని స్తంభాన్ని మకొచోటుకు మార్చితే సమస్య తొలగిపోతుంది. జిల్లా, మండల ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలోని పొలాలు, ఇండ్ల వద్ద వైర్లను సరిచేయాలని కోరుతున్నాం.

- రవీందర్, కంకల్